క్లుప్తంగా

కార్మికులకు మేడే శుభాకాంక్షలు

● మాజీ మంత్రి ఆదిమూలపు సురేష్


ఆదిమూలపు సురేష్

సింగరాయకొండ: కొండపి నియోజకవర్గంలోని కార్మికులకు వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి, పీఏసీ సభ్యుడు, మాజీ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ మే డే శుభాకాంక్షలు తెలిపారు. అరుగాలం శ్రమిస్తూ దేశ ఆర్థికాభివృద్ధికి తమ వంతు సహాయ సహకారాలు అందిస్తున్న కార్మిక సోదరులంతా సుఖసంతోషాలతో జీవించాలని, కార్మిక దినోత్సవాన్ని ఘనంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు.

వరాహ లక్ష్మీనరసింహ స్వామికి లక్ష తులసి పూజ


లక్ష్మీనరసింహ స్వామి

సింగరాయకొండ: స్థానిక పాతసింగరాయకొండలోని వరాహ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో బుధవారం స్వామివారికి అక్షయ తృతీయ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు ఉదయగిరి వెంకటశేష లక్ష్మీనరసింహాచార్యులు ఆధ్వర్యంలో స్వామివారిని చందనంతో ప్రత్యేకంగా అలంకరించారు. లక్ష తులసి పూజను ఘనంగా నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

కొలతల ప్రకారమే బిల్లులు

హనుమంతునిపాడు: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పని చేస్తున్న కూలీలకు ఇచ్చిన కొలతల ప్రకారమే బిల్లులు చెల్లిస్తామని ఎంపీడీఓ ఎం.రంగసుబ్బరాయుడు అన్నారు. బుధవారం ఉపాధి ఎఫ్ఏలు, టీఏలతో ఆయన స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సమావేశమయ్యారు. ఎంపీడీఓ మాట్లాడుతూ ఉపాధి పనిలో రోజువారీ కూలీల సంఖ్య పెంచాలన్నారు. రోజూ 23 గ్రామ పంచాయతీల్లో 5 వేల మంది కూలీలకు తగ్గకుండా పని చేయాలని చెప్పారు. ఏపీఓ కె.వినయ్, టీఏలు పాల్గొన్నారు.

స్కూల్ కమిటీ తీర్మానాలను పరిగణనలోకి తీసుకోవాలి

సీఎస్‌పురం (పామూరు): పాఠశాల విద్యా కమిటీ సభ్యులు తీర్మానించినట్లు మండలంలో ప్రస్తుతం ఉన్న ఆరు ప్రాథమిక పాఠశాలలను కొనసాగించేలా అధికారులు తగు చర్యలు తీసుకోవాలని ఏపీటీఎఫ్ జిల్లా కార్యదర్శి షేక్ నాయబ్ రసూల్, మండల శాఖ అధ్యక్ష, కార్యదర్శులు తోట శ్రీనివాసులు, జీఎస్ ఆనంద్‌బాబులు కోరారు. ఈ సందర్భంగా బుధవారం వారు మాట్లాడుతూ పాఠశాల అవసరాల నేపథ్యం, పాఠశాల స్థితిగతుల్లో స్కూల్ కమిటీ కీలకపాత్ర పోషిస్తోందని, అలాంటి స్కూల్ కమిటీలు ఇచ్చిన తీర్మానాలను పక్కన పెట్టి యూపీ స్కూల్ డీ గ్రేడ్ చేయడం సరికాదని, ఇప్పటికైనా అధికారులు స్పందించి మారుమూల ప్రాంతమైన సీఎస్‌పురం మండలంలోని ఆరు యూపీ పాఠశాలలను కొనసాగించాలన్నారు. జిల్లాలో కొనసాగిస్తున్న ప్రాథమిక, ఉన్నత పాఠశాలల నిబంధనల మేరకే ఈ పాఠశాలలను కూడా కొనసాగించాలన్నారు.

ఏపీటీఎస్‌ఏ జిల్లా జాయింట్ సెక్రటరీకి సన్మానం

కనిగిరి రూరల్: ఏపీటీఎస్‌ఏ జిల్లా కార్యవర్గ జాయింట్ సెక్రటరీగా ఎన్నికైన కనిగిరి ఉప ఖజానా కార్యాలయ జూనియర్ అకౌంటెంట్ కె.ప్రసాద్ చంద్రను బుధవారం స్థానిక కార్యాలయంలో ఆ సంఘ నాయకులు, ఉద్యోగులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎన్జీవో సంఘ తాలూకా అధ్యక్షుడు పీవీ రమణారెడ్డి, కార్యదర్శి ఎస్కే హజరత్ అలీ, జాయింట్ సెక్రటరీ జి.కిరణ్‌కుమార్, ట్రెజరర్ పీవీసీ కిరణ్‌కుమార్, బాలకృష్ణ, నాయబ్ రసూల్, గణేష్ పాల్గొన్నారు.

మజ్జిగ పంపిణీ కేంద్రం ప్రారంభం


మజ్జిగ పంపిణీని ప్రారంభిస్తున్న మానవత సంస్థ సభ్యులు

పామూరు: వేసవి దృష్ట్యా ప్రయాణికులు, స్థానిక ప్రజల కోసం మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో దాతలు మజ్జిగ పంపిణీ చేయడం అభినందనీయమని ఆర్యవైశ్య సంఘ నాయకులు, స్థానిక వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయ చైర్మన్ కోట నరసింహారావు అన్నారు. మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో స్థానిక పూలకొట్ల సెంటర్ సమీపంలో ఏర్పాటు చేసిన మజ్జిగ పంపిణీ కేంద్రాన్ని బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా నరసింహారావు మాట్లాడుతూ నిత్యం రద్దీగా ఉండే కూడలిలో పాదచారులు, వాహనదారులు, ఇతర ప్రజల కోసం మజ్జిగ కేంద్రాన్ని ఏర్పాటు చేయడం విశేషమన్నారు. సంస్థ అధ్యక్షుడు మెడబలిమి మునలయ్య, నేరెళ్ల బాబూరావు, తోట రమేష్, వెండిదండి వెంకటేశ్వరరెడ్డి, పోలక తిరుపతిరెడ్డి, పరమేశ్వరరావు, ఆకుల మాల్యాద్రి, ఎం.తిరుపతిరెడ్డి, సేగు కృష్ణయ్య, రంగారెడ్డి పాల్గొన్నారు.

రైతు కంట్లో కారం

● గిట్టుబాటు ధరల్లేక అల్లాడుతున్న మిర్చి రైతు
● ఖర్చులు కూడా రావంటున్న అన్నదాతలు



కనిగిరి రూరల్:

కూటమి ప్రభుత్వం రైతన్నల కంట్లో కారం కొట్టింది. పంట పండినా.. ధరలు లేక రైతన్నలు అల్లాడుతున్నారు. ఖరీఫ్, రబీ సీజన్‌లో అన్నదాత పూర్తిగా నష్టపోయారు. గిట్టుబాటు ధరలు కల్పించి.. రైతన్నలకు అండగా నిలబడాల్సిన కూటమి ప్రభుత్వం కనీస కనికరం లేకుండా వ్యవహరిస్తోంది. మద్దతు ధర కల్పించక పోవడంతో రైతులు లబోదిబోమంటూ కన్నీటి పర్యంతమవుతున్నారు. అరుగాలం శ్రమించిన రైతన్న పండించిన పంటకు గిట్టుబాటు ధర లేక అప్పులు తెచ్చి పెట్టిన పెట్టుబడులకు వడ్డీలు కట్ట లేక విలవిల్లాడుతున్నాడు. ప్రస్తుతం మిర్చి రైతుల పరిస్థితి మరింత దయనీయంగా ఉంది. మిర్చి పంట సాగుకు లక్షల రూపాయలు పెట్టుబడులు పెట్టిన రైతులకు..అకాల వర్షాలు, ప్రకృతి వైపరీత్యాలు, వైరస్ తెగుళ్ల ఇలా అనేకం వెంటాడినా.. వాటి బారి నుంచి పంటను రక్షించుకున్న రైతన్నకు చివరకు మద్దతు ధర లభించక దిగాలు పడ్డాడు. ఇంటిల్లపాదీ కష్టపడినా..కనీస కూలీ గిట్టుబాబు అయ్యే పరిస్థితి లేక గగ్గోలు పెడుతున్నాడు.

మిర్చి ధరలు పతనం

కూటమి ప్రభుత్వంలో మిర్చి ధరలు పతనమయ్యాయి. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో మిర్చి క్వింటా రూ.16,500 నుంచి రూ.20 వేల వరకు పలికింది. రైతులు ఎంతో సంతోషంగా పంటను విక్రయించి లాభాలు గడించారు. నేటి కూటమి సర్కార్‌లో మిర్చి ధరలు అథోపాతాళానికి పోయాయి. క్వింటా రూ.6 వేల నుంచి రూ.7,500లకు దిగజారింది. ప్రస్తుతం ఉన్న ధరకు మిర్చి అమ్మితే కూలీల ఖర్చులు కూడా రావని రైతులు వాపోతున్నారు. కోల్డ్ స్టోరేజీలో పెడదామంటే ధరలు పెరుగుతాయనే ఆశ లేని పరిస్థితి. ఎరువులు, పురుగుమందులు, విత్తనాలు వగైరా వాటికి బ్యాంకుల్లో, షావుకారుల వద్ద తెచ్చిన అప్పులను ఎలా తీర్చాలని లోలోన కుమిలిపోతున్నారు. కొందరు రైతులైతే అప్పులకు భయపడి వ్యాపారులు అడిగిన ధరలకే అడ్డంగా అమ్మేస్తున్నారు. మిర్చి రైతుకు గిట్టుబాటు ధర కల్పించి ఆదుకుంటామని హామీలు గుప్పించిన కూటమి నేతలు మాటలు నీటి మూటలుగా మారాయి. ఫలితంగా మిర్చి రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది.

కనిగిరి నియోజకవర్గంలో మిర్చి సాగు విస్తీర్ణం (ఎకరాల్లో)

కనిగిరి మండలంలో	720
హెచ్‌ఎంపాడు మండలంలో	110
వెలిగండ్ల మండలంలో	205
పీసీపల్లి మండలంలో	666
పామూరు మండలంలో	159
సీఎస్‌పురం మండలంలో	94

వైవీ సుబ్బారెడ్డికి దద్దాల శుభాకాంక్షలు


వైవీకి శుభాకాంక్షలు తెలుపుతున్న దద్దాల

కనిగిరి రూరల్: రాజ్యసభ సభ్యుడు వైవీ సుబ్బారెడ్డికి వైఎస్సార్ సీపీ కనిగిరి ఇన్‌చార్జి డాక్టర్ దద్దాల నారాయణ యాదవ్ ముందస్తు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఒంగోలులో వైవీ సుబ్బారెడ్డిని బుధవారం ఆయన మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. దద్దాల నారాయణ వెంట పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు గుంటక తిరుపతిరెడ్డి, జెడ్పీటీసీ కస్తూరిరెడ్డి, పామూరు మండల అధ్యక్షుడు గంగసాని హుస్సేన్‌రెడ్డి, ఆవుల భాస్కర్‌రెడ్డి, జి.ఆదినారాయణరెడ్డి, గట్ట విజయభాస్కర్‌రెడ్డి, శ్రీరామ శ్రీనివాసులు, సైకం ఏడుకొండలు, చెనికల శ్రీనివాసులు, బారా షరీఫ్, నాగమణి, సుస్మిత, తుపాకుల ఆంజనేయులరెడ్డి, పాలేటి ప్రేమ్‌కుమార్, కోడూరి రామసుబ్బారెడ్డి, పోలు మోహన్‌రెడ్డి, ఎస్కే నాగూర్, మడతల వెంకటేశ్వర్‌రెడ్డి, తోకల బ్రహ్మయ్య, ఇండ్ల శ్రీకాంత్ పాల్గొన్నారు.

బాల్య వివాహాలను అరికట్టాలి


ప్రతిజ్ఞలో చైర్మన్ గఫార్, పలు సంస్థల ప్రతినిధులు

సీఎస్‌పురం (పామూరు): బాల్య వివాహాలను అరికట్టాలని ఎంఈఓ జె.ప్రసాదరావు అన్నారు. స్థానిక అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం కిశోర వికాసం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ ప్రసాదరావు మాట్లాడుతూ బాలికల సంపూర్ణ విద్యతోనే బాల్యవివాహాలను నియంత్రించవచ్చని, తల్లిదండ్రులు తమ పిల్లలను విద్య వైపు ప్రోత్సహించాలన్నారు. డాక్టర్ సందిరెడ్డి మురళి మాట్లాడుతూ కిశోర బాలికలు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలన్నారు. ఎక్కడైనా బాల్యవివాహాలు, బాలికల నిర్బంధం వంటి సమాచారం ఉంటే ఐసీడీఎస్, పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. యాక్టివ్ సూపర్‌వైజర్ సరళారెడ్డి పాల్గొన్నారు.

పామూరు: కిశోర బాలికలకు వేసవి సెలవు దినాల్లో బాల్యవివాహాలు, బాలికల అక్రమ రవాణా తదితర అంశాలపై అవగాహన కల్పించాలని ఎంపీపీ గంగసాని లక్ష్మి, ఎంపీడీఓ ఎల్.బ్రహ్మయ్య, ఎంఈఓ కరుణకుమారి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఐసీడీఎస్ సూపర్‌వైజర్ గోళ్ల పద్మజ అధ్యక్షతన మహిళా పోలీసులు, ఎంపీహెచ్‌లు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు, వీఓఏలకు కిశోర వికాసంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎంపీపీ, ఎంపీడీఓ మాట్లాడుతూ సెలవు దినాల్లో గ్రామస్థాయిలో ఐదుగురు కమిటీ సభ్యులు కిశోర బాలికలను గుర్తించి వారిలో 10 లేదా 15 మందిని గ్రూపుగా చేసి వ్యక్తిగత పరిశుభ్రత, నైతిక విలువలు, గుడ్‌టచ్, బ్యాడ్ టచ్‌ల గురించి తెలియజేయాలని కోరారు. డాక్టర్ నాయబ్ రసూల్, వీవీ నాగవాణి, రామసుబ్బులు, టి.అమల, జి.అనిత, రమీజ, మహిళా పోలీసులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలు అరికట్టాలి

కనిగిరి రూరల్: బాల్యవివాహ రహిత దేశంగా నిర్మించడం మనందరి బాధ్యతని మున్సిపల్ చైర్మన్ ఎస్కే అబ్దుల్ గఫార్ అన్నారు. బాల్య వివాహాలకు వ్యతిరేకంగా మత పెద్దలు, ప్రజలను ఐక్య పరిచే లక్ష్యంతో బుధవారం వివిధ సంస్థల ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ గఫార్ బాల్య వివాహాల నివారణ చట్టంపై అవగాహన కల్పించారు. బాల్య వివాహాలు చేసినా, ప్రోత్సాహించినా చట్ట ప్రకారం కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. అనంతరం పలువురితో ప్రతిజ్ఞ చేయించారు. కార్యాక్రమంలో వివిధ స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు గంధం శ్యామ్యుల్ ఘెర్షం, మంద్రు రమేష్, దాసరి విజయ్‌కుమార్, సలోవి, కునిగపోగు జోసఫ్, సిద్దార్ధ, గూడూరి అబ్రహం లింకన్, ఎస్కే అహ్మద్ అలీ, ఎస్కే మహబూబ్ అలీ, ఎస్కే బాషా పాల్గొన్నారు.

హామీల ఊసెత్తని కూటమి ప్రభుత్వం



సమావేశంలో మాట్లాడుతున్న ఎంఎల్ నారాయణ

సీఎస్‌పురం (పామూరు): రాష్ట్రంలో టీడీపీ నేతృత్వంలోని టీడీపీ, బీజేపీ, జనసేన కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి 11 మాసాలైనా ఎన్నికల వేళ ఇచ్చిన హామీల అమలు ఊసేలేదని సీపీఐ జిల్లా కార్యదర్శి మన్నేపల్లి లక్ష్మీనారాయణ అన్నారు. స్థానిక బెల్లంకొండ కళాశాలలో సీపీఐ మండల 6వ మహాసభ కామ్రేడ్ సవరం రమేష్, ఎస్కేవై మౌలాలీల అధ్యక్షతన జరిగింది. మహాసభలకు ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా కార్యదర్శి లక్ష్మీనారాయణ మాట్లాడుతూ పేద బడుగు, బలహీల వర్గాల సమస్యల పరిష్కారం కోసం నిత్యం పోరాటాలు చేస్తున్న ఏకైక పార్టీ సీపీఐ అని, సీపీఐ పోరాటాలకు 100 సంవత్సరాల చరిత్ర ఉందన్నారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల వేళ ఇచ్చిన సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయాలన్నారు. సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు సయ్యద్ యాసిన్, సయ్యద్ మౌలాలీలు మాట్లాడుతూ మండలంలో వేలాది ఎకరాలు ప్రభుత్వ భూములు ఉన్నాయని, బడాబాబులు వాటిని అనుభవిస్తున్నారన్నారు. అర్హులైన పేదలకు సాగు భూములు, నివేశన స్థలాలు మంజూరు చేయాలన్నారు. కనిగిరి నియోజకవర్గ మహాసభ మే 28వ తేదీన సీఎస్‌పురంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సీపీఐ నాయకులు పోతల ప్రభాకర్, మండల కార్యదర్శి ఎస్కేవై పెదమస్తాన్ పాల్గొన్నారు.

సమాచార హక్కు చట్టంతో అక్రమాలకు చెక్


కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపీడీవో దేవసేనకుమారి

టంగుటూరు: సమాచార హక్కు చట్టంతో అక్రమాలకు చెక్ పెట్టవచ్చని ఎంపీడీవో దేవసేన కుమారి అన్నారు. ఆంధ్రప్రదేశ్ సమాచార కమిషనర్ ఆదేశాల మేరకు బుధవారం మండలంలోని అనంతవరంలో సమాచార హక్కు చట్టంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఎంపీడీవో దేవసేనకుమారి పాల్గొని మాట్లాడారు. గ్రామాల్లో ప్రభుత్వ నిధులు ఏ విధంగా ఖర్చు చేస్తున్నారు, ఆ నిధులు ప్రజలకు ఏ విధంగా ఉపయోగపడుతున్నాయి, తదితర వివరాలను సమాచార హక్కు చట్టం ద్వారా తెలుసుకుని అధికారులను ప్రశ్నించవచ్చని తెలిపారు. కార్యక్రమంలో ఎంఈఓ చెంచు పున్నయ్య, అనంతవరం ఉప సర్పంచ్ భాస్కర్, వెలగపూడి మాజీ సర్పంచ్ వెంకటేశ్వర్లు, ఏపీఓ మాచర్ల, పంచాయతీ కార్యదర్శి మాలతి, తదితరులు పాల్గొన్నారు.

ఎఫ్‌ఏల సంఘ అధ్యక్షుడిగా కేతిరెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న బడుగు

హనుమంతునిపాడు: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ఎఫ్ఏల నూతన కార్యవర్గ అధ్యక్షుడిగా లింగంగుంట్ల ఎఫ్ఏ కెతిరెడ్డి వెంకటేశ్వర్రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. బుధవారం మండల కేంద్రంలో ఎఫ్ఏల నూతన కార్యవర్గ సంఘ ఎన్నిక జరిగింది. సమావేశానికి జిల్లా వ్యవసాయ కార్మిక సంఘ ఉపాధ్యక్షుడు బడుగు వెంకటేశ్వర్లు అధ్యక్షత వహించారు. ఉపాధ్యక్షుడిగా జె.ప్రసాద్, ప్రధాన కార్యదర్శిగా జి.వెంకటేశ్వర్లు, సహాయ కార్యదర్శిగా జి.చిన్న, ట్రెజరర్‌గా కె.రవి, సభ్యులుగా జి.గురుకృష్ణ, పి.లక్ష్మీదేవి, జి.రాజేష్, జి.హరినాథ్‌రెడ్డిలను ఎన్నుకున్నారు.

వైభవంగా అభయాంజనేయ ప్రతిష్ట


పూజలు చేస్తున్న ఇన్‌చార్జి దద్దాల, నాయకులు

సీఎస్‌పురం (పామూరు): మండలంలోని రెడ్డిగారిపల్లెలో నూతనంగా నిర్మించిన శ్రీ అభయాంజనేయ స్వామి ఆలయంలో అభయాంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ట కార్యక్రమం బుధవారం రుత్వికులు వేదమంత్రాలతో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ కనిగిరి నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ దద్దాల నారాయణ యాదవ్, మండల పార్టీ అధ్యక్షుడు పాలుగుళ్ల మల్లికార్జునరెడ్డి పాల్గొని పూజలు చేశారు. గ్రామస్తులు వారిని ఘనంగా సన్మానించారు. పార్టీ మండల అధ్యక్షుడు పాలుగుళ్ల మల్లికార్జునరెడ్డి, మాజీ అధ్యక్షుడు భువనగిరి వెంకటయ్య, పులి రాధాకృష్ణారెడ్డి, కనిగిరి మున్సిపల్ వైస్ చైర్మన్ పులి శాంతి, గోవర్దన్ రెడ్డి, బైరెడ్డి తిరుపతిరెడ్డి, సిద్ధు వెంకటరెడ్డి, అంబాల చిన వెంకటరెడ్డి, సుబ్బారెడ్డి, మిట్టపాలెం నారాయణస్వామి ఆలయ మాజీ చైర్మన్ దుగ్గిరెడ్డి జయరెడ్డి పాల్గొన్నారు.

కొనసాగిన టోల్ ప్లాజా కార్మికుల ధర్నా


టోల్ ప్లాజా వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న కార్మికులు

టంగుటూరు: తమ సమస్యలు పరిష్కరించాలని టంగుటూరు టోల్ ప్లాజా కార్మికులు చేస్తున్న ధర్నా బుధవారం 16వ రోజు కొనసాగింది. టోల్ ప్లాజా వద్ద కార్మికులు నిరసన వ్యక్తం చేశారు. లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్, నేషనల్ హాలిడే, టికెట్ క్యాన్సిలేషన్ చేయాలని, ఫేస్, తంబ్ విషయంలో సమస్యలన్నీ పరిష్కరించాలని, ఆఫీస్ బాయ్ కొరత ఉందని, డిన్నర్ చేసే చోట నీటి సమస్య ఉందని, లైన్‌లో బూత్‌కి సంబంధించి తలుపులు, కిటికీలు కొత్తవి ఏర్పాటు చేయాలని, ఓవర్ లోడ్‌కి సంబంధించి నో ఆప్షన్‌ని వెంటనే ఒకే చేయాలని, లేకుంటే దీనివలన సమయం వృథా అవుతుందని తెలిపారు. మే డే సందర్భంగా జెండా ఆవిష్కరణ కార్యక్రమం ఏర్పాటు చేస్తుండగా, పోలీసుల సహాయంతో యాజమాన్యం అడ్డుకునే ప్రయత్నం చేసింది. కార్మికులు వ్యతిరేకించడంతో పోలీసులు వెనుదిరిగారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు రాము, తిరుమలరావు, కాశీవిశ్వనాథ్, తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై నిర్లక్ష్యం వద్దు

సింగరాయకొండ: అధికారులు ప్రజా సమస్యల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని తహసీల్దార్ టి.రవి అన్నారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక అయిన మండల సర్వసభ్య సమావేశంతో పాటు ఇతర కార్యక్రమాలకు కూడా అధికారులు గైర్హాజరు కావడంపై తహసీల్దార్ అసహనం వ్యక్తం చేశారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం సాయంత్రం ఎంపీపీ కట్టా శోభారాణి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. మండలంలో తాగునీటి సమస్య పరిష్కారానికి ప్రతిపాదనలు పంపామని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ రమేష్ తెలిపారు. మంచినీటి బోర్లు మరమ్మతులకు గురైతే పంచాయతీ కార్యాలయంలో ఫిర్యాదు చేయవచ్చని సూచించారు. సమావేశానికి ఎక్కువ శాతం కిందిస్థాయి అధికారులు తప్ప మండల స్థాయి అధికారులు గైర్హాజరవడంతో కుర్చీలన్నీ ఖాళీగా దర్శనమిచ్చాయి. ఎంపీడీఓ డి.జయమణి, ఎంపీటీసీలు, మండల, గ్రామస్థాయి అధికారులు పాల్గొన్నారు.

వేసవి శిక్షణ తరగతులకు హాజరు కావాలి

సీఎస్‌పురం (పామూరు): గ్రంథాలయం ఆధ్వర్యంలో వేసవి శిక్షణ తరగతులకు పిల్లలు నిత్యం పెద్ద సంఖ్యలో హాజరు కావాలని గ్రంథపాలకుడు ఆళ్ల భాస్కరరావు, ఉపాధ్యాయురాలు ప్రమీల అన్నారు. స్థానిక పాఠశాలలో బుధవారం వేసవి శిక్షణ తరగతుల్లో పాల్గొన్న విద్యార్థులకు నీతి కథలు చెప్పి చదివించుట, మానవత విలువలతో కూడిన కథలు, స్పోకెన్ ఇంగ్లిష్ తదితర అంశాలపై ఉపాధ్యాయురాలు క్లాసులు నిర్వహించారు.

ప్రజల పక్షాన నిలిచి సమస్యలపై పోరాడండి

● వైఎస్సార్ సీపీ నాయకులకు రాజ్యసభ సభ్యుడు వైవీ సుబ్బారెడ్డి పిలుపు


వైవీ సుబ్బారెడ్డితో వైఎస్సార్ సీపీ కొండపి నియోజకవర్గ మండలాల అధ్యక్షులు

సింగరాయకొండ: పేద ప్రజల పక్షాన నిలబడి ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడాలని రాజ్యసభ సభ్యుడు వైవీ సుబ్బారెడ్డి వైఎస్సార్ సీపీ నాయకులకు పిలుపునిచ్చారు. నియోజకవర్గంలోని మండలాలకు నూతనంగా పార్టీ అధ్యక్షులుగా నియమితులైన వారిని బుధవారం ఒంగోలులోని వైవీ సుబ్బారెడ్డి నివాసంలో వైవీ సుబ్బారెడ్డికి పార్టీ కొండపి నియోజకవర్గ ఇన్‌చార్జి, పీఏసీ సభ్యుడు, మాజీ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ పరిచయం చేశారు. ఈ సందర్భంగా సుబ్బారెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం సంక్షేమ పథకాలివ్వకుండా పేద ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తోందని విమర్శించారు. పంటలకు గిట్టుబాటు ధరలు లేవని, అన్నదాత సుఖీభవ పథకం కూడా అమలు కాకపోవడంతో రైతులు అవస్థపడుతున్నారని అన్నారు. కూటమి పార్టీలకు చెందిన నాయకుల దోపిడీ ఎక్కువైందని, ఎప్పటికప్పుడు కూటమి ప్రభుత్వాన్ని ఎండగడుతూ ప్రజలకు సంక్షేమ పథకాలు దక్కేలా పోరాటాలు చేయాలని నాయకులకు సూచించారు. నూతనంగా ఎంపికైన మండలాధ్యక్షులు తమ నియామకాలకు సహకరించిన వైవీ సుబ్బారెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఆయన పుట్టినరోజు సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు మసనం వెంకట్రావు, నాయకులు పిన్నిక శ్రీనివాసులు, చింతపల్లి హరిబాబు, బచ్చల కోటేశ్వరరావు, జిల్లా ఉపాధ్యక్షుడు డాకా పిచ్చిరెడ్డి, నియోజకవర్గ యువజన విభాగం అధ్యక్షుడు మారంరెడ్డి గంగాధరరెడ్డి, బీసీ సెల్ అధ్యక్షుడు యామవరపు వీరవసంతరావు, జరుగుమల్లి సర్పంచ్ కె.పున్నారావు, తదితరులు పాల్గొన్నారు.

మేడే కార్యక్రమాలను జయప్రదం చేయండి


వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మోహన్, తదితరులు


ఏఐటీయూసీ ఆధ్వర్యంలో జెండాను సిద్ధం చేస్తున్న మున్సిపల్ కార్మికులు

సింగరాయకొండ: జిల్లాలో మే డే కార్యక్రమాలను జయప్రదం చేయాలని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆర్.మోహన్ పిలుపునిచ్చారు. మే డే సందర్భంగా మండల కేంద్రంలోని శాంతి థియేటర్ సమీపంలో బుధవారం వాల్‌పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. మోహన్ పాల్గొని మాట్లాడుతూ 139 సంవత్సరాల క్రితం చికాగో కార్మిక వర్గం 8 గంటల పనిదినాలు కావాలని ఉద్యమాలు చేసి సాధించిందన్నారు. కానీ, నేడు బీజేపీ, ఆర్ఎస్ఎస్ పాలకులు 8 గంటల పనిదినాలను రద్దు చేసి 12 గంటలు, 18 గంటలు పని చేసే విధంగా కుట్రలు పన్నుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కార్మికుల హక్కులను కాలరాసే నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ పథకాలు అమలు చేస్తామని హామీలిచ్చి అధికారంలోకి వచ్చి సంవత్సరం కావస్తున్నా ఇంతవరకు అమలు చేయలేదని విమర్శించారు. 2018వ సంవత్సరం నుంచి పెండింగ్‌లో ఉన్న భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ పథకాలను అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అఖిల భారత రైతు కూలీ సంఘ జిల్లా అధ్యక్షుడు కె.నాంచార్లు, రాసాని వెంకయ్య, షేక్ బాబు తదితరులు పాల్గొన్నారు.

మేడే వేడుకలకు కార్మికులు రెడీ

కనిగిరి రూరల్: చికాగో నగరంలో శ్రమజీవుల రక్తం చిందించింది నే(మే)డే. కార్మికుల చీకట్లపై చెమట చుక్కల గెలుపు నేడే. ఎర్ర ఎర్రని జెండా ఎగిరింది నేడే..కార్మిక, కర్షక, శ్రామిక జీవులు దండుకట్టి హక్కుల కోసం పోరాట పిడికిలి బిగించి నేడే..విప్లవ పోరాట శంఖరావం మోగింది నేడే..కార్మికుల ఐక్యత చాటింది నేడే..శ్రమ దోపిడీపై, కార్మికుల హక్కులపై విజయం సాధించింది నేడే..! ప్రపంచ కార్మికుల దినోత్సవం మేడే వేడుకలను గురువారం ఘనంగా జరుపుకునేందుకు కార్మిక వర్గాలు సన్నద్ధమవుతున్నాయి. సంఘటిత, అసంఘటిత కార్మికులు మేడే సంబరాల విజయవంతం చేసుకునేందుకు ఇప్పటికే సభలు, సమావేశాలు నిర్వహించుకున్నారు. పట్టణంలో ఏఐటీయూసీ, సీఐటీయూ ఆధ్వర్యంలో వివిధ కార్మిక సంఘాలు అరుణ పతాకాలను సిద్ధం చేసుకుంటున్నారు. జెండా దిమ్మెలకు ఎరుపు రంగులను దిద్దుతున్నారు. ఎర్రటి కార్మిక తోరణాలను సిద్ధం చేసుకుంటున్నారు. దీంతో పట్టణంలో మేడే సంబరాల సందడి నెలకొంది.

అర్హులకు పథకాలు అందేలా చూడాలి


మాట్లాడుతున్న ఎంపీపీ అత్యాల జఫన్యా

పీసీపల్లి: అర్హులకు ప్రభుత్వ పథకాలు అందేలా చూడాలని ఎంపీపీ అత్యాల జెఫన్యా సూచించారు. బుధవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో ప్రభాకర్ శర్మ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయాధికారి ప్రకాశ్‌రావు మాట్లాడుతూ యంత్ర పరికరాలు రాయితీపై ఇస్తున్నామని, అర్హులైన రైతులు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. డాక్టర్ మంజుల మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు వేసవి కాలంలో బయట తిరగకుండా ఉండాలని, చిన్న పిల్లలు వేడికి తట్టుకోలేరని చెప్పారు. ఎంఈఓ శ్రీనివాసాచారి మాట్లాడుతూ ఐదేళ్లు నిండిన ప్రతి పిల్లవాడు ప్రభుత్వ పాఠశాలలో చేరేలా ప్రోత్సహించాలన్నారు. ఏపీవో జహంగీర్ బాషా మాట్లాడుతూ ఈ ఏడాది పనులు ఆలస్యంగా ప్రతిపాదనలు రావడం, వలస కూలీలకు పనులు పెట్టడం ఆలస్యమైందని, ఇప్పటి నుంచి పనులు ప్రారంభమవుతాయని తెలిపారు. ఐదు ఎకరాల్లోపు ఉన్న రైతులు పండ్ల తోటలకు అర్హులని, నిమ్మ, బత్తాయి, జామ, డ్రాగన్ పండ్ల తోటలు సాగు చేసుకోవాలన్నారు. గృహ నిర్మాణ శాఖ డీఈ కోటిరెడ్డి మాట్లాడుతూ గతేడాది మంజూరైన ఇళ్లు ఇంకా నిర్మించకుంటే పంచాయతీ తీర్మానం ఇస్తే క్యాన్సిల్ చేస్తామని, మళ్లీ దరఖాస్తు పెట్టుకోవచ్చన్నారు. తరుచూ సర్వసభ్య సమావేశాలకు హాజరు కాని అధికారులపై చర్యలు తీసుకుంటామని ఎంపీపీ హెచ్చరించారు. సమావేశంలో జెడ్పీటీసీ లక్ష్మీకాంతం, ఎంపీటీసీలు భూమిరెడ్డి కొండారెడ్డి, చెరుకూరు సతీష్, వైస్ ఎంపీపీ చెరుకూరి ప్రసూన, సర్పంచ్‌లు పరిమి వెంకట్రావు, నరేంద్ర చౌదరి, కో ఆప్షన్ సభ్యులు కరీంబాయ్ పాల్గొన్నారు.

ముస్లిం ఐక్యవేదిక ఆధ్వర్యంలో నిరసన


మాట్లాడుతున్న ముఫ్తి కలాం, సయ్యద్ యాసీన్

కనిగిరి రూరల్: జమ్మూ కశ్మీర్‌లోని పహల్గంలో పర్యాటకులపై ఉగ్రవాదుల దాడిని ఖండిస్తూ ముస్లిం ఐక్యవేదిక, జమియత్ ఏ ఉలేమా, అంజుమన్ కమిటీల ఆధ్వర్యంలో బుధవారం నిరసన వ్యక్తం చేశారు. స్థానిక ఒంగోలు బస్టాండ్‌లోని అంబేడ్కర్ విగ్రహం వద్ద జరిగిన కార్యక్రమంలో జమియతే ఏ ఉలేమా నాయకులు ముఫ్తి అబ్దుల్ కలాం, అంజుమన్ కమిటీ మాజీ కార్యదర్శి సయ్యద్ యాసీన్ మాట్లాడుతూ పర్యాటకులపై ఉగ్రవాదుల దాడిని తీవ్రంగా ఖండించారు. కేంద్ర ప్రభుత్వం చొరవ చూపి జమ్మూ కశ్మీర్‌లోని పర్యాటక ప్రాంతాల్లో కట్టుదిట్టమైన భద్రత చర్యలు చేపట్టి ఉగ్రవాదులను తుద ముట్టించాలన్నారు. మతోన్మాదం నశించాలి, హిందు, ముస్లింలు ఐక్యంగా ఉందాం.. ఉగ్రవాదాన్ని తరిమి కొడదాం..అంటూ పిలుపునిచ్చారు. ఉగ్రవాదుల దాడుల్లో మృతి చెందిన వారికి ప్రగాఢ నివాళులర్పించారు. ఉగ్రవాదుల దాడుల్లో కేవలం ఒక మతం వారు మాత్రమే చనిపోయారంటూ కొన్ని మీడియా చానళ్లు చెప్పడం సమంజసం కాదన్నారు. జమియతే ఉలేమా కమిటీ సభ్యులు మౌలానా గులాం రసూల్, ముఫ్తి సద్దాం, మౌలానా రబ్బాని, మహ్మద్ అలీ, బిలాల్, ఆయూబ్, యాసీన్, ఇర్ఫాన్, అంజుమన్ నాయకులు ముస్తఫా, రహీం, కాలేషా, కరీముల్లా, ముస్లిం నాయకులు పాల్గొన్నారు.

పచ్చిరొట్ట విత్తనాలతో భూమి సారవంతం


టంగుటూరులో వేలం నిర్వహిస్తున్న వేలం నిర్వహణాధికారి శ్రీనివాసరావు

టంగుటూరు: రైతులు పచ్చిరొట్ట విత్తనాలు నాటి కలియదున్నితే భూమి సారవంతమై నాణ్యమైన పంట దిగుబడులు వస్తాయని టంగుటూరు పొగాకు వేలం కేంద్రం వేలం నిర్వహణాధికారి శ్రీనివాసరావు తెలిపారు. స్థానిక పొగాకు వేలం కేంద్రంలో బుధవారం రైతులతో ఆయన మాట్లాడారు. వేలం కేంద్రం పరిధిలోని చిరుకూరపాడు, పంగులూరివారిపాలెం గ్రామాలకు చెందిన రైతులు 762 పొగాకు బేళ్లను బుధవారం వేలానికి తీసుకురాగా, వాటిలో 649 బేళ్లను వ్యాపారులు కొనుగోలు చేశారు. 113 బేళ్లను తిరస్కరించారు. కేజీ గరిష్ట ధర రూ.280, కనిష్ట ధర రూ.215, సరాసరి ధర రూ.260.71 పలికింది. వేలంలో మొత్తం 20 మంది వ్యాపారులు పాల్గొన్నట్లు వేలం నిర్వహణాధికారి శ్రీనివాసరావు తెలిపారు.

పొగాకు కనిష్ట ధర కేజీ రూ.215


వేలం నిర్వహిస్తున్న నిర్వహణాధికారి సునీల్‌కుమార్

కొండపి: స్థానిక పొగాకు వేలం కేంద్రంలో బుధవారం నిర్వహించిన వేలంలో కేజీ కనిష్ట ధర రూ.215 పలికినట్లు వేలం నిర్వహణధికారి జి.సునీల్‌కుమార్ తెలిపారు. క్లస్టర్ పరిధిలోని అనకర్లపూడి, ముప్పరాజుపాలెం, మిట్టపాలెం, పెరిదేపి గ్రామాలకు చెందిన రైతులు 892 బేళ్లను వేలానికి తీసుకొచ్చారు. వాటిలో 771 బేళ్లు కొనుగోలయ్యాయి. వ్యాపారులు వివిధ కారణాలతో 121 బేళ్లను తిరస్కరించారు. కేజీ పొగాకు గరిష్ట ధర రూ.280, కనిష్ట ధర రూ.215, సరాసరి ధర రూ 257.13గా నమోదైంది. వేలంలో 16 కంపెనీలకు చెందిన వ్యాపార ప్రతినిధులు పాల్గొన్నారు. మే డే సందర్భంగా గురువారం పొగాకు వేలానికి సెలవు ప్రకటించినట్లు వేలం నిర్వహణాధికారి సునీల్‌కుమార్ తెలిపారు.